


కాంతు లీనెడు చెలి మోము
చెంత నేను
ఒక్క దివ్వెను వెలిగించి వుంచి
నాను
మెరుగు కనగానె పరుగెత్తు
పురుగు యిపుడు
దేనివైపున కేగునో తేల్చుకొనగ.

ఉరుదూ మూలం : — దాఘ్

అనువాదం : — ఈదుపల్లి

ఎట్లాగైతేనేం ముత్యాలరావుగారు పగడాలరావుగారితో వియ్యమందారు.

## ఎవరుకారణం?




నాగవల్లి తంతు మొదలైంది. అల్లుడుగారు సరదాగా అలకపాన్పు ఎక్కి, చిన్న కోరిక కోరాడు. మామగారు ముత్యాలరావుని స్కూటరు కొనిపెట్టమని. అంతకు కొద్దిరోజుల క్రితమే చదివిన "వాహనాలు - ప్రమాదాలు" వ్యాసం కళ్ళ ముందు మెదిలి, ముత్యాలరావు కాస్త పస్తాయించాడు. ఆయన సంకోచాన్ని మరోలా అర్థం చేసుకున్న అల్లుడు. ఈసారి సరదా మానేసి నిజంగానే అలిగాడు. 'బోడి పెళ్ళి చేశారు. ఈపాటి ముచ్చట అల్లుడికి తీర్చడానికి వెధవ పిసినారితనం అడ్డం పడుతోంది. డబ్బుండగానే సరా? ఇంతకంటే అడుక్కుతినే ముష్టివాడు నయం' అని అల్లుడు దులిపేసరికి, తనని పైసాకి ఠికానాలేని ముష్టివాడితో పోల్చాడని ముత్యాలరావుకి తిక్కరేగింది. స్కూటరు కాదుకదా దాని బోల్టుకూడా ఇవ్వను పొమ్మన్నాడు. వేడి రక్తం అల్లుడు గారిలో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. పంతం పెరిగింది. 'స్కూటరు కొనిస్తేనే మీ అమ్మాయినేలుకునేది' అని ఖచ్చితంగా తేల్చిపారేశాడు. అంతవరకూ వచ్చాక వెనక్కు తగ్గటం ముత్యాలరావు జాతకంలోనే లేదు. 'పోరా నీవు ఏలుకోకపోతే, నా కూతురికి బ్రతుకే గడవకపోదు' అని కసిరి కొట్టాడు. అంతే. ఆ నాటితో మామగారికీ అల్లుడికి సంబంధం విచ్ఛిన్నమైంది. నచ్చచెప్పబోయిన పెద్ద మనుషుల దగ్గర అల్లుడు స్కూటరు తనకి ముఖ్యం అంటే ముత్యాలరావు తనకి ప్రిస్టేజి ప్రాణం అన్నాడు.

కాలగర్భంలో రెండేళ్ళు కలిసిపోయాయి. ముసలాయన ముత్యాలరావులో పంతం కాస్త సడల సాగింది. సందర్భం చూసుకొని ఆయన భార్య "దాని ముఖాన అలా రాసిపెట్టింది పసుపు బట్టలతోనే ఇంట్లో వుంచి మాట పట్టింపుకోసం దాని గొంతుకోశాం" అని కళ్ళనీళ్ళు పెట్టుకొనేసరికి ముత్యాలరావు మత్తు వదలిపోయింది. అల్లుడు గార్ని పండక్కి రమ్మని పిల్చి స్కూటరుతోపాటు. అమ్మాయినికూడా సాగనంపి గుండెనిండా ఊపిరి పీల్చుకున్నాడు. కాని తర్వాత వారం రోజులకి. సాయంత్రం పూట స్కూటరు మీద షికారుకెళ్ళిన అల్లుడు. లారీ క్రింద పడి హరీమన్నాడు. ఈ ఘోర వార్త విన్నాక ముత్యాలరావు తేల్చుకోలేనిది ఒక్కటే! ఏ భయం వల్ల అల్లుడికి స్కూటర్ కొనివ్వలేక పోయాడో....అదే జరగడమేమిటి? అందుకు కారణం. అల్లుడా? తనా? ఇద్దరూ కారకులయితే. ఏ కారణమూలేని కూతురుమాటేమిటి?

